సాక్షి
చిత్తూరు
గురువారం । 12 । జూన్ । 2025



ఎస్జీటీ బదిలీల్లో రగడ

ఎస్జీటీ కౌన్సెలింగ్‌లో స్పౌజ్ పాయింట్ల విషయంలో కొంత మంది టీచర్లకు అన్యాయం జరగడంపై ఆందోళన నెలకొంది. - 8లో



ప్రాణాలుపోతున్నా పట్టించుకోరా?

ప్రాణాపాయ స్థితిలో ఉన్నా ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు పట్టించుకోవడం లేదని మండల సభ్యులు మండిపడ్డారు. - 8లో



నెరవేరిన పేదల కల

25 ఏళ్లుగా నివాసం ఉంటున్న 47 మందికి పూర్తి హక్కులు కల్పిస్తూ కలెక్టర్ ఇంటి పట్టాలు అందజేశారు. - 8లో

న్యూస్‌రీల్

262 మందికి కళాజ్యోతి పురస్కారాలు



గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న సమాఖ్య సభ్యులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : కళల వారసత్వానికి బాపుగా 262 మంది కళాకారులకు 'కళాజ్యోతి' జాతీయ పురస్కారాలు– 2025ను భారతీయ తెలుగు రచయితల సమాఖ్య, ఎం.వి.కేశవరెడ్డి స్మారక ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రదానం చేస్తున్నట్లు నిర్వాహకులు ఎం.వి. శ్రీధర్ రెడ్డి, సి.నారాయణస్వామి తెలిపారు. స్థానిక కార్యాలయంలో కళాకారుల సమ్మేళన గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్థానిక నాగయ్య కళాక్షేత్రంలో ఈనెల 15న ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సమ్మేళన కార్యక్రమం జరగనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సినీనటుడు రాజేంద్ర ప్రసాద్, సినీగీతా రచయిత సుద్దాల అశోక్ తేజ, పూర్వ రాష్ట్రపతి మనుమడు జి. సుబ్రమణ్యం శర్మ, నూతన సినీ నటుడు నవీన్, సినీ దర్శకుడు లేలిధర్ రావు కోరలా, సినీ సంగీత దర్శకుడు జశ్వంత్, న్యాయమూర్తి కరుణకుమార్, తదితరులు పాల్గొంటారని పేర్కొన్నారు.

ఐ అండ్ పీఆర్ డీడీగా వేలాయుధం




కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వేలాయుధం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ ఇంచార్జి డీడీగా వేలాయుధం నియమితులయ్యారు. అనంతపురం సమాచార పౌరసంబంధాల శాఖ డీఐపీఆర్‌ఓగా విధులు నిర్వహిస్తున్న ఆయనను తిరుపతి జిల్లా ఎస్ఐసీశాఖ ఏడీగా నియమించారు. అలాగే చిత్తూరు జిల్లా ఐ అండ్ పీఆర్ ఇంచార్జి డీడీగా అదనపు బాధ్యతలను అప్పగించారు. ఆయన గతంలో తిరుపతి, రాజంపేట, అనంతపురం జిల్లాల్లో విధులు నిర్వహించారు. ఇప్పటి వరకు డీడీగా విధులు నిర్వహించిన పద్మజ వైఎస్సార్ కడప జిల్లా డిప్యూటీ డైరెక్టర్‌గా బదిలీ అయ్యారు. నూతన డీడీ వేలాయుధం బుధవారం బాధ్యతలు స్వీకరించి కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ, జాయింట్ కలెక్టర్ విద్యాధరిని మర్యాద పూర్వకంగా కలిశారు.

నేడు 501 నుంచి ఎస్జీటీల కౌన్సెలింగ్

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని ఎస్జీటీల సీనియారిటీ జాబితాలో 501 సీరియల్ నంబర్ నుంచి ఈనెల 12న బదిలీల కౌన్సెలింగ్ ఉంటుందని డీఈఓ వరలక్ష్మి వెల్లడించారు. ఈ మేరకు బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. చిత్తూరులోని షర్మన్ పాఠశాలలో గురువారం 501 నంబర్ నుంచి 1000 వరకు ఎస్జీటీల బదిలీల కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. సంబంధిత టీచర్లు కౌన్సెలింగ్‌కు తప్పక హాజరు కావాలని ఆదేశించారు.

గరుడ వాహనంపై గోవిందుడు



మోహినీ అవతారంలో వేంకటేశ్వర స్వామి

వడమాలపేట (విజయపురం) : అప్పలాయగుంటలో వెలసిన శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో ఐదవ రోజు బుధవారం ప్రసన్న వేంకటేశ్వరస్వామి గరుడ వాహనంపై విహరించారు. పట్టు పీతాంబరాలు, విశేష స్వర్ణాభరణాలతో స్వామి ఊరేగుతుండగా భక్తుల గోవింద నామస్మరణతో మాడ వీ ధులు మార్మోగాయి. ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకు పల్లకిలో మోహినీ అవతారంలో స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు.

గరుడ సేవలో తరించిన భక్తజనం



బ్రహ్మోత్సవాల్లో ఎప్పుడెప్పుడా అని ఎదురు చూసే గరుడ సేవలో పాల్గొన్న అశేష భక్తజనం స్వామిని కనులారా దర్శించి తరించారు. రాత్రి 7.30 గంటలకు స్వామివారు సుందరంగా అలంకరితుడై గరుత్మంతుడిపై విహరిస్తూ భక్తులకు కనువిందు చేశారు. డిప్యూటీ ఈఓ హరీంద్రనాథ్, ఏఈఓ దేవరాజు, సూపరింటెండెంట్ శ్రీవాణి, శివకుమార్, అర్చకులు పాల్గొన్నారు.

నిర్వీర్య బడి

కూటమి పాలనలో సర్కారు బడుల్లో చదువు గాల్లో దీపంలా మారింది. వేసవి సెలవులు అనంతరం జిల్లా వ్యాప్తంగా గురువారం పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. జిల్లా వ్యాప్తంగా సర్కారు బడుల్లో సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. ప్రభుత్వ బడుల్లో టీచర్ల కొరత, బదిలీలు పూర్తి కాకపోవడంతో గందరగోళ పరిస్థితి, పునఃప్రారంభం రోజు అందజేసే విద్యా మిత్ర కిట్లు అరకొరగా చేరడం, మరుగుదొడ్లు అధ్వానంగా ఉండడంతో సమస్యలు కొట్టుమిట్టాడుతున్నాయి. వైఎస్సార్‌సీపీ పాలనలో వెలుగు వెలిగిన సర్కారు బడులు ప్రస్తుతం కూటమి పాలనలో అస్తవ్యస్తంగా మారాయి. నేడు జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు పునఃప్రారంభం నేపథ్యంలో సాక్షి గ్రౌండ్ రిపోర్ట్ కథనం.

- నేటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభం
- పూర్తి కాని ఉపాధ్యాయుల బదిలీలు
- సర్కారు బడుల్లో సమస్యల తోరణం
- పూర్తి కాని తరగతి గదులు, మరుగుదొడ్ల నిర్మాణాలు
- అరకొరగా విద్యామిత్ర కిట్ల సరఫరా

అర్ధాంతరంగా ఆగిపోయిన విజయపురం జెడ్పీ హైస్కూల్ అదనపు తరగతి గదులు



చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఉన్న సర్కారు బడులు కూటమి పాలనలో సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయి. గత వైఎస్సార్‌సీపీ సర్కారులో సకల వసతులతో ఆహ్లాదకరంగా సాగిన సర్కారు చదువు ప్రస్తుత కూటమి పాలనలో ప్రశ్నార్థకంగా మారింది. నేడు పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో వెంటాడుతున్న సమస్యలు విద్యార్థుల తల్లిదండ్రులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. జిల్లాలోని సర్కారు బడుల్లో విద్యనభ్యసిస్తున్న పేద విద్యార్థులకు కనీస సౌకర్యాలు కరువయ్యాయి.

ఆరుబయటే చదువులు

జిల్లా వ్యాప్తంగా ఉన్న సర్కారు బడుల్లో నాడు–నేడు పథకాన్ని ప్రస్తుత కూటమి ప్రభుత్వం నిలిపివేసింది. దీంతో జిల్లాలోని వేలాది పాఠశాలల్లో మౌలిక వసతులు కొట్టుమిట్టాడుతున్నాయి. గత వైఎస్సార్‌సీపీ సర్కారు పాలనలో మొదటి విడత నాడు–నేడులో 1533 పాఠశాలల్లో రూ.354 కోట్లతో, రెండో విడతలో 1183 పాఠశాలలు, 30 జూనియర్ కళాశాలల్లో రూ.424 కోట్లతో పనులు చేపట్టారు. రెండో విడతలో నిర్వహిస్తున్న పనులను కూటమి సర్కారు నిలిపివేయడంతో సమస్యలు కొట్టుమిట్టాడుతున్నాయి. కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో సీఎం సొంత నియోజకవర్గమైన కుప్పంలో మాత్రమే పనులు నిర్వహిస్తున్నారు. మిగిలిన నియోజకవర్గాలపై సవతితల్లి ప్రేమ చూపిస్తోంది. పలు పాఠశాలల్లో విద్యార్థులకు సరిపడా గదులు లేక ఆరుబయట చదువులకు స్వాగతం పలికే పరిస్థితి నెలకొంది.

బదిలీలు పూర్తికాకముందే..

ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో గత నెల రోజులుగా టీచర్లలో అన్ని కేడర్‌లకు బదిలీలు నిర్వహిస్తున్నారు. పాఠశాలలు పునఃప్రారంభమయ్యే రోజుకు టీచర్ల కొరత లేకుండా చేస్తామని విద్యాశాఖ మంత్రి లోకేష్ ఆర్భాటంగా గొప్పలు చెప్పారు. అయితే ఆ మాటలు ఒట్టిమాటలేనని తేలిపోయింది. ఇప్పటి వరకు డీఎస్సీ పరీక్షలు, బదిలీల ప్రక్రియ పూర్తి కాకపోవడంతో ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేకపోయారు. జిల్లాలో ఇంకా 3 వేలకు పైగా ఎస్జీటీ టీచర్లకు బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించాల్సి ఉంది. అదే విధంగా స్కూల్ అసిస్టెంట్ తెలుగు, హిందీ టీచర్లు బదిలీ అయినప్పటికీ వారిని రిలీవ్ చేయని పరిస్థితి. మరికొన్ని పాఠశాలల్లో టీచర్లు బదిలీలు అయినప్పటికీ రిలీవర్ లేకపోవడంతో ఏమి చేయాలో తెలియని దుస్థితి. అదే విధంగా వేల మంది ఎస్జీటీలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తుండటంతో పాఠశాలల పునః ప్రారంభం రోజున పాఠశాలలకు వెళ్లలేని పరిస్థితి. దీంతో తొలిరోజే ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్లు లేక బోసిపోవాల్సిన దుర్భర పరిస్థితులు జిల్లాలో నెలకొన్నాయి.







అరకొరగా సరఫరా అయిన విద్యామిత్ర కిట్లు, సంచుల్లోనే మూలుగుతున్న విద్యా సామగ్రి, నాసిరకంగా పంపిణీ చేసిన బ్యాగులు

పాఠశాలల సమాచారం

పాఠశాల కేటగిరీ	పాఠశాలల సంఖ్య	విద్యార్థుల సంఖ్య
ప్రాథమిక	1,949	52,469
ప్రాథమికోన్నత	158	10,293
ఉన్నత	355	85,668
మొత్తం	2,462	1,48,430

పబ్లిసిటీ ఫుల్..సరఫరా అంతంతే..

జిల్లా వ్యాప్తంగా ఉన్న సర్కారు బడుల్లో చదివే విద్యార్థులకు తొలిరోజే సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర పేరుతో స్టూడెంట్స్ కిట్లు అందజేస్తామని కూటమి గొప్పలు చెప్పింది. అందుకు అవసరమైన పబ్లిసిటీని చేసుకుంది. అయితే ఈనెల 12వ తేదీన పాఠశాలలు పునఃప్రారంభం అవుతున్న నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా విద్యార్థులకు పూర్తి స్థాయిలో ఆ కిట్లను చేర్చలేక విఫలం అయ్యింది. జిల్లాలోని 2462 పాఠశాలల్లో చదువుతున్న 148430 విద్యార్థులకు, నూతనంగా అడ్మిషన్లు పొందే విద్యార్థులకు కిట్లను పంపిణీ చేయాల్సి ఉంది. అయితే పూర్తి స్థాయిలో కిట్లను సరఫరా చేయకుండా అరకొరగా పంపిణీ చేశారు. పాఠ్యపుస్తకాలు, వర్క్‌బుక్స్, బ్యాగులు, యూనిఫాం అరకొరగా వచ్చాయి. షూలు ఒక్కటీ అందలేదు.

కార్పొరేట్‌కు అనుకూలంగా కూటమి



కూటమి సర్కారు సర్కారు బడులను నిర్వీర్యం చేసేలా కుట్రలు చేస్తోంది. గత ప్రభుత్వం సర్కారు బడులకు అభివృద్ధికి వేల కోట్లు ఖర్చు చేసింది. ఈ ప్రభుత్వం కార్పొరేట్ బడులను బలోపేతం చేస్తోంది. పాఠశాలలు పునఃప్రారంభం రోజున పూర్తి స్థాయిలో విద్యార్థులకు కిట్లు ఇవ్వకపోవడం సర్కారు వైఫల్యమే. అదే విధంగా గత సర్కారు నిర్వహిస్తున్న నాడు–నేడు పనులను నిలిపివేయడంతో పాఠశాలల్లో మౌలిక వసతులు లేక కొట్టుమిట్టాడుతున్నాయి. – సద్దాం, స్టూడెంట్స్ జేఏసీ చైర్మన్, చిత్తూరు జిల్లా

విద్యార్థులకు అందించే కిట్ వివరాలు

కిట్‌లోని వస్తువులు	పంపిణీ చేయాల్సినవి	ఇప్పటి వరకు వచ్చినవి	ఇంకా రావాల్సినవి
పాఠ్యపుస్తకాలు, వర్క్‌బుక్స్	1587618	1571868	15750
బ్యాగులు	144400	126604	17796
యూనిఫాం	144400	67800	76600
బెల్టులు	103563	103563	–
షూస్	144189	00	144189
6 వ తరగతి డిక్షనరీలు	12771	12771	–
1వ తరగతి డిక్షనరీలు	24728	24728	–
నోటు పుస్తకాలు	836872	836872	–

మద్దతు ధరతోనే మామిడిని కొనాలి

– పరిశ్రమల నిర్వాహకులకు కలెక్టర్ ఆదేశాలు

తవణంపల్లె : రాష్ట్ర ప్రభుత్వం తోతాపురి మామిడి రైతులకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరను విధిగా రైతులకు అందించేలా గుజ్జు ఫ్యాక్టరీ యజమానులు పనిచేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. బుధవారం మండలంలోని జీసీఆర్ ఫుడ్ అండ్ బేవరేజెస్ ప్రైవేట్ లిమిటెడ్ , ఎంఎఫ్‌పీఐ, ఫీల్ ఫ్రెష్ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ గుజ్జు ఫ్యాక్టరీని, సిద్ధార్థ, ఎఫ్3 గుజ్జు ఫ్యాక్టరీలను కలెక్టర్ తనిఖీ చేశారు. బంగారుపాళ్యం హార్టికల్చర్ అధికారి సాగరిక ఫ్యాక్టరీ యజమానులు ధరను నిర్ణయించడం లేదని వివరించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ.. తోతాపురి రకానికి ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధరను విధిగా అమలు చేయాలని ఫ్యాక్టరీ యజమానులకు దిశానిర్దేశం చేశారు. ఫ్యాక్టరీ యజమానులు మామిడికి మద్దతు ధరను అమలు చేసి రైతులు, అధికార యంత్రాంగానికి సహకరించాలన్నారు. గుజ్జు ఫ్యాక్టరీల వద్ద విధులకు కేటాయించిన సిబ్బంది తోతాపురి మామిడి రైతుల పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. కలెక్టర్‌తో పాటు తవణంపల్లె తహసీల్దార్ సుధాకర్, అధికారులు పాల్గొన్నారు.



జీసీఆర్ గుజ్జు ఫ్యాక్టరీలో తోతాపురి మద్దతు ధర గురించి ఆరా తీస్తున్న కలెక్టర్

తోతాపురి కొనుగోలు



ఫ్యాక్టరీని తనిఖీ చేస్తున్న ఆర్డీఓ శ్రీనివాసులు

గుడిపాల : తోతాపురి కాయలు మాకొద్దని మండలంలోని తాసా జ్యూస్ ఫ్యాక్టరీ యాజమాన్యం చెప్పడంతో బుధవారం అధికారులు స్పందించారు. దీంతో రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాసులు, తహసీల్దార్ జయంతి ఫ్యాక్టరీలో తనిఖీలు నిర్వహించి వారితో సంప్రదింపులు జరిపారు. తోతాపురి మామిడి కాయలను కొనుగోలు చేయాల్సిందేనంటూ హుకుం జారీ చేశారు. దీంతో ప్రతి రోజు 50 పర్మిట్లు తీసుకుంటామని వారికి తెలియజేశారు. వెంటనే రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులను ఫ్యాక్టరీలో నియమించి టోకెన్ల ప్రక్రియను ప్రారంభించారు. దశల వారీగా ఎక్కువగా పర్మిట్లు అందజేయనున్నట్లు ఫ్యాక్టరీ యాజమాన్యం తెలియజేసింది.

డీటీలకు ఉద్యోగోన్నతులు

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని రెవెన్యూశాఖలో పనిచేస్తున్న పలువురు డిప్యూటీ తహసీల్దార్లకు అడహక్ పద్ధతిలో తహసీల్దార్లుగా ఉద్యోగోన్నతి కల్పించారు. ఉద్యోగోన్నతి కల్పించిన డీటీలకు అంతర్ జిల్లా బదిలీలు చేసి జిల్లాలను కేటాయించారు. ఈ మేరకు బుధవారం నోడల్ అధికారి, కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయా జిల్లాలకు కేటాయించిన డీటీలకు ఆయా కలెక్టర్లు తహసీల్దార్లుగా పోస్టింగ్‌లు ఇవ్వనున్నారు. కాగా ఈ ఉద్యోగోన్నతులు తాత్కాలికమేనని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. చిత్తూరు అర్బన్ తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డిని తిరుపతి జిల్లాకు, తిరుపతి జిల్లా డీఎస్‌వో కార్యాలయంలో పనిచేస్తున్న రేఖను చిత్తూరు జిల్లాకు బదిలీ చేశారు.

- ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 24 మంది డిప్యూటీ తహసీల్దార్లను అడహక్ పద్ధతిలో తహసీల్దార్లుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ జిల్లాలను కేటాయించారు. అన్నమయ్య జిల్లాలోని డీటీలు ఇలా....బావాజాన్ (సంబేపల్లి), హరికుమార్ (తంబళ్లపల్లి), రామాంజనేయులు (రామాపురం), ప్రదీప్ (ములకలచెరువు), వెంకటేశులు (ములకలచెరువు), క్రాంతికుమార్ (కేవీ పల్లి), తపస్విని (కురబలకోట), మహమ్మద్ అజారుద్దీన్ (డీఎస్‌వో కార్యాలయం), నారు పమిలేటి (వాల్మీకిపురం)లకు ఉద్యోగోన్నతులు కల్పించి అన్నమయ్య జిల్లాకు కేటాయించారు.
- తిరుపతి జిల్లాలో పనిచేస్తున్న డిప్యూటీ తహసీల్దార్లు శాంతి (ఆర్డీవో కార్యాలయం, శ్రీకాళహస్తి), తనూజ (డీఎస్‌వో కార్యాలయం, తిరుపతి) ఉద్యోగోన్నతి కల్పించి తిరుపతి జిల్లా కేటాయించారు.
- చిత్తూరు జిల్లాకు కేటాయించిన డీటీలు ఇలా రాజేంద్ర (తిరుపతి), పార్థసారథి (యాదమరి), రమేష్‌బా బు (పూతలపట్టు), కిరణ్ (విజయపురం), జయసింహా (పులిచెర్ల), శ్రీనివాసులు (తిరుపతి), శ్రావన్‌కుమార్ (పెనుమూరు), రాధిక (తిరుపతి), నాగరాజు (కార్వేటినగరం), కాలేష్ (విజయపురం), మాధవి (చౌడేపల్లి), కళ్యాణి (బంగారుపాళ్యం) లకు తహసీల్దార్‌లుగా ఉద్యోగోన్నతి కల్పించారు. వీరందరికీ త్వరలో తహసీల్దార్లుగా మండలాలను కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేయనున్నారు.

అన్నదాతల అగచాట్లు

గంగాధర నెల్లూరు : మండలంలోని మామిడి రైతుల కష్టాలు వర్ణనాతీతం. మండల కేంద్రంలోని జైన్ మామిడి గుజ్జు పరిశ్రమ గేట్ల వద్ద ఉదయం నుంచి మిట్ట మధ్యాహ్నం వరకు వేచి చూసినా టోకెన్లు దక్కని రైతుల ఆవేదన పట్టించుకునే వారేలేరు. కనీస సదుపాయాలు కూడా కల్పించని యాజమాన్యం ఎర్రటి ఎండలోనే నడిరోడ్లపైన రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. ఉదయం 5 గంటల నుంచే లైన్‌లో ఉండగా 10 గంటల సమయంలో కొందరు సెక్యూరిటీ గార్డులు వచ్చి ఈ రోజు టోకెన్లు ఇవ్వడం కుదరదు అందరూ వెళ్లిపోండి అంటూ అక్కడ నుంచి పంపేశారు. దీంతో రైతులు వాగ్వాదానికి దిగారు. తర్వాత 80 మందికి టోకెన్లు ఇచ్చి మిగతా వారిని తరిమేశారు. కాగా ప్రభుత్వం తోతాపురి రకం మామిడిని ఎనిమిది రూపాయలకు కొనమని మార్గదర్శకాలు విడుదల చేయగా ఫ్యాక్టరీ యాజమాన్యాలు మాత్రం 6, 7 రూపాయలకే కొంటున్నారని సమాచారం. వేబ్రిడ్జి వద్ద తూకం అవ్వగానే ఆరు ,ఏడు రూపాయలకే కొంటున్నట్లు సంతకాలు సేకరించి ఆ తర్వాత రైతు పేరు మామిడి కాయల బరువు మాత్రం రసీదు ఇచ్చి పంపించడం పై విమర్శలు వస్తున్నాయి. ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శకాలను అమలు చేయాలని రైతులు నిలదీశారు. కర్మాగారం యాజమాన్యం స్పందిస్తూ ఫ్యాక్టరీ రోజుకు 70, 80 టోకెన్లు మాత్రం ఇవ్వగల సామర్థ్యం కలదని, వందలాది రైతులు వస్తుంటే తామేంచేయ్యాలిఅని అన్నారు. జిల్లా అధికారులు యాజమాన్యాలతో చర్చలు జరిపి మామిడి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.



సెక్యూరిటీ సిబ్బందితో రైతుల వాగ్వాదం



గేట్ల వద్ద పడిగాపులు కాస్తున్న మామిడి రైతులు





అప్లికేషన్లను కట్ట కట్టి ఒక మూలన పడేసిన దృశ్యం, టోకెన్ల కోసం రైతుల అవస్థలు

సాక్షిని అణగదొక్కాలని కుట్ర

- మాజీ ఉపముఖ్యమంత్రి నారాయణ స్వామి



మాజీ ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి

చిత్తూరు కార్పొరేషన్ : ప్రజల పక్షాన నిలబడి వారి సమస్యలను ఎత్తి చూపుతున్న సాక్షి మీడియాను అణగదొక్కాలని అధికార పార్టీ కుట్ర చేస్తోందని మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి ధ్వజమెత్తారు. బుధవారం మీడియాతో మాట్లాడారు. సీనియర్ జర్నలిస్టు కేఎస్ ఆర్‌పై అక్రమ కేసులు పెట్టడం ఎంత వరకు న్యాయమన్నారు. ఎక్కడైన షో నిర్వహించిన జర్నలిస్టును అరెస్టు చేస్తారా అని ప్రశ్నించారు. ఈ సాకుతో సాక్షి కార్యాలయాలపై దాడులు చేయిస్తున్నారన్నారు. మాజీ సీఎం భార్యపై సామాజిక మాధ్యమాల ద్వారా వైరల్ చేసిన పోస్టుల పై చర్య లేదన్నారు..? జగనన్న పాలనలో పార్టీలకతీతంగా పథకాలు అందించారన్నారు. అప్పుడు లబ్ధి పొందిన టీడీపీ కార్యకర్తలు, నాయకులు చేత వైఎస్సార్‌సీపీ వారి మీద కూటమి నాయకత్వం దాడుల చేయిస్తోందన్నారు. బాబు ఏడాది పాలనలో విచ్చలవిడిగా మద్యం ఏరులై పారుతోందన్నారు. టన్నుల కొద్ది ఇసుక అక్రమంగా పక్క రాష్ట్రాలకు వెళుతోందన్నారు. గతంలో నందమూరి బాలకృష్ణ మహిళపై చులకనగా మాట్లాడిన విషయం గుర్తు చేశారు. మహిళలపై అత్యాచారాలు పెరుగుతున్నా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు శూన్యమన్నారు.

ప్రతి మండలానికి పీఎం 'సూర్యఘర్'

చిత్తూరు కార్పొరేషన్ : జిల్లాలోని ప్రతి మండలానికి 500 పీఎం సూర్యఘర్ కనెక్షన్లు లక్ష్యంగా పెట్టుకోవాలని ట్రాన్స్‌కో ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్, పీఎం సూర్యఘర్ జిల్లా స్పెషల్ ఆఫీసర్ నరేంద్రనాథ్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక అర్బన్ డివిజన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. సెక్షన్ పరిధిలో రోజు 20 మంది వినియోగదారులకు వీటిపై ప్రచారం చేయాలన్నారు. నెలకు 300 యూనిట్లు దాటిన ఓసీ, బీసీ వినియోగదారులపై ఎక్కువగా దృష్టి పెట్టాలన్నారు. బీసీలకు ప్రభుత్వం అదనంగా రూ.20 వేలు సబ్సిడీ ఇస్తోందని వీటిపై అవగాహన కల్పించాలన్నారు. సూర్యఘర్ నమోదును ఆన్‌లైన్‌లో చేయించి వెండర్లతో అనుసంధానం చేయించాలన్నారు. జిల్లాలో 3,200 వ్యవసాయ సర్వీసులను సకాలంలో విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో ఈఈ మునిచంద్ర, టెక్నికల్ ఈఈ జగదీష్, ఏఓ ప్రసన్న ఆంజనేయులు డీఈలు ప్రసాద్, ఆనంద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్, సూర్యఘర్ స్పెషల్ ఆఫీసర్ నరేంద్రనాథ్

క్లుప్తంగా

వెండి పాత్రల బహూకరణ



వెండి పాత్రలు విరాళంగా అందజేస్తున్న దాతలు

కాణిపాకం : కాణిపాకంలోని శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానానికి బుధవారం ఓ దాత వెండి పాత్రలు బహూకరణ చేశారు. చిత్తూరు చెందిన శివ భరద్వాజ్ కుటుంబ సభ్యులు రూ.1.75 లక్షలు విలువ చేసే 1.700 కిలోల వెండి బిందె, అర్చన పళ్లెంను ఈఓ పెంచల కిషోర్‌కు అందజేశారు. అనంతరం వారికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన భాగ్యం కల్పించారు. కార్యక్రమంలో ఏఈవో రవీంద్రబాబు, సిబ్బంది ఉన్నారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండడంతో భక్తులు ఏటీఎంజీ షెడ్ వరకు బారులు తీరారు. మంగళవారం అర్ధరాత్రి వరకు 80,894 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 32,508 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.4.30 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేనివారికి 18 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనమవుతోంది. సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికే క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. కేటాయించిన సమయం కంటే ముందు వెళితే క్యూలో అనుమతించమని స్పష్టం చేసింది.

కత్తితో బెదిరించిన వ్యక్తి అరెస్ట్

చిత్తూరు అర్బన్ : కత్తితో బెదిరించి నగదు, మొబైల్ ఫోన్ లాక్కున్న వ్యక్తిని వన్‌టౌన్ పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. చిత్తూరు నగరంలో మంగళవారం మల్లికార్జునరెడ్డిని గుర్తు తెలియని వ్యక్తి కత్తితో బెదిరించి మొబైల్ ఫోన్, నగదు దౌర్జన్యంగా లాక్కెళ్లిపోయాడు. దీంతో బాధితుడు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు నగరంలోని జానకారపల్లికి చెందిన అజల్ అలియాస్ సింగమలై గా గుర్తించారు. బుధవారం నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

కారు ఢీకొని యువకుడి మృతి



జ్ఞానేంద్రకుమార్ (ఫైల్)

వడమాలపేట (విజయపురం) : వడమాలపేట టోల్‌గేట్ సమీపంలో కారు ఢీకొని జ్ఞానేంద్రకుమార్ (22) అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన బుధవారం చోటు చేసుకొంది. పోలీసుల కథనం మేరకు ఇలా...వడమాలపేటకు చెందిన జ్ఞానేంద్రకుమార్ స్థానికంగా ఉన్న పెట్రోల్ బంక్‌లో పెట్రోల్ పట్టుకోవడం కోసం బైక్‌పై వెళ్తుండగా పుత్తూరు నుంచి తిరుపతి వెళ్తున్న కారు ఎదురుగా ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ధర్మారెడ్డి తెలిపారు.

- స్పౌజ్ పాయింట్లపై రచ్చ
- అధికారుల ఎదుట ఓ టీచర్ ఆత్మహత్యాయత్నం
- డీఆర్‌ఓను చుట్టుముట్టిన టీచర్లు
- బందోబస్తు నడుమ కౌన్సెలింగ్

ఎస్జీటీ బదిలీల్లో రగడ



కౌన్సెలింగ్ ప్రక్రియలో మాట్లాడుతున్న డీఆర్‌వో మోహన్‌కుమార్, న్యాయం చేయాలని మొరపెట్టుకున్నా ఫలితం లేకపోవడంతో ఆప్షన్ కోరుకోని టీచర్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని షర్మన్ బాలికోన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఎస్జీటీ కౌన్సెలింగ్‌లో స్పౌజ్ పాయింట్ల విషయంలో కొందరికి న్యాయం..మరికొందరికి అన్యాయం చేశారు. విద్యాశాఖ అధికారులు ఇష్టానుసారం ఆకస్మిక నిర్ణయాలు తీసుకుంటూ టీచర్లను ముప్పుతిప్పలు పెట్టారు. ఎస్జీటీ బదిలీల కౌన్సెలింగ్ ప్రక్రియలో స్పౌజ్ పాయింట్ల విషయంలో వివాదం తలెత్తింది. మంగళవారం రాత్రి, బుధవారం నిర్వహించిన బదిలీల కౌన్సెలింగ్‌లో స్పౌజ్ పాయింట్ల విషయంలో 204 సీరియల్ నంబర్ లోపు ఉన్న చాలా మంది టీచర్లకు కోరుకున్న ప్రాంతానికి బదిలీ చేశారు. అయితే బుధవారం వేకువ జామున 3 గంటల సమయంలో స్పౌజ్ పాయింట్ల విషయంలో నష్టం జరుగుతోందని ఓ ఉపాధ్యాయుడు ఆత్మహత్య చేసుకుంటానని భయాందోళన సృష్టించారు. దీంతో కౌన్సెలింగ్ ప్రక్రియను విద్యాశాఖ అధికారులు ఆపివేశారు.

ఇష్టానుసారం మార్పులు

బదిలీల్లో స్పౌజ్ పాయింట్ల విషయంలో గందరగోళం నెలకొంది. ఇద్దరు భార్యభర్తలు ఎస్జీటీలుగా ఉండి తప్పనిసరి బదిలీలకు దరఖాస్తు చేసుకుంటే స్పౌజ్ నిబంధనల కింద సీనియారిటీ జాబితాలో ముందు ఉన్న వ్యక్తి స్పౌజ్ కు అర్హులైతే తరువాత ఉన్న స్పౌజ్ ఎక్కడికి బదిలీ అవుతారో తెలియదు కాబట్టి జిల్లాలో ఎక్కడైనా కోరుకునే అవకాశం కల్పించాలి. అయితే 8 ఏళ్లు పూర్తి అయిన స్థానంనే పరిగణలోకి తీసుకుని తిరిగి అక్కడే కోరుకోవాలనే వింత నిబంధనను అమలు చేశారు. ఈ నిబంధనతో చాలా మంది టీచర్లు నిరాశ, ఆవేదనకు గురవుతున్నారు. కుప్పంలో పనిచేస్తున్న ఇద్దరు భార్యభర్తలను తిరిగి కుప్పంలోనే కోరుకోవాలని ఒత్తిడి చేయడం ఎంత వరకు సబబు అని బాధితులు ప్రశ్నించారు.

స్పౌజ్ పాయింట్లు తీసేయాలని..

ఎస్జీటీల కౌన్సెలింగ్ కేంద్రంలోకి ఉపాధ్యాయ సంఘం నేతలను అనుమతించకుండా పోలీసు బందోబస్తును పెట్టి భయాందోళన సృష్టిస్తున్నారు. జరుగుతున్న అన్యాయాలను ప్రశ్నించే గొంతును నొక్కేసి బదిలీల ప్రక్రియను ఇష్టానుసారంగా, ఏకపక్షంగా నిర్వహిస్తున్నారు. ఈ బదిలీల తతంగంలో స్పౌజ్ పాయింట్లు రద్దు చేసుకునే అవకాశం కల్పించాలని ఎస్జీటీలు మొరపెట్టుకుంటున్నా విద్యాశాఖ అధికారులు పట్టించుకోని పరిస్థితి. ఇష్టముంటే బదిలీ కోరుకోండి లేకపోతే వెళ్లిపోండి అంటూ హుకుం జారీ చేస్తున్నారు. దీంతో చాలా మంది టీచర్లు బదిలీలు కోరకుండానే వెనుదిరిగారు. కూటమి పాలనలో వింత ధోరణిలో నిర్వహిస్తున్న బదిలీల తతంగంపై టీచర్లు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

డీఆర్‌ఓను చుట్టుముట్టిన నేతలు

బుధవారం ఉదయం 10.30 గంటలకు తిరిగి కౌన్సెలింగ్ ప్రక్రియను ప్రారంభించారు. ఈ ఘటన విషయం కలెక్టర్ దృష్టికి వెళ్లడంతో డీఆర్‌వో మోహన్ కుమార్ ను కౌన్సెలింగ్ కేంద్రం వద్దకు పంపించారు. డీఆర్‌వో కౌన్సెలింగ్ కేంద్రం వద్దకు చేరుకోగానే యూటీఎఫ్, వైఎస్సార్‌టీఎఫ్, ఎస్టీయూ సంఘాల నేతలు, పలువురు బాధిత టీచర్లు న్యాయం చేయాలంటూ డీఆర్‌వోను చుట్టుముట్టారు. ఆ సమయంలో సంబంధిత టీచర్ల సమస్యలను డీఆర్‌వో స్పష్టంగా విన్న తర్వాత కలెక్టర్, విద్యాశాఖ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. కాసేపు చర్చలు జరిపిన అనంతరం డీఆర్‌వో టీచర్లకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు.



కౌన్సెలింగ్ కేంద్రంలో డీఆర్‌వో మోహన్‌కుమార్‌ను చుట్టుముట్టిన టీచర్లు

చిరుత కలకలం

– దాడిలో దూడ మృతి

చౌడేపల్లె : మండలంలో చిరుత కలకలం రేపింది. చిరుత పులి దాడిలో దూడ మృతి చెందిన ఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. బాధితుడి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గోసల కురప్పల్లెకు చెందిన కుమార్‌కు అలంకాలమ్మకొండ సమీపంలోని కలచ్చం బావి వద్ద వ్యవసాయ పొలం ఉంది. అక్కడే ఆవులను పెట్టుకొని, బావిలోని నీటితో వ్యవసాయం చేస్తున్నాడు. పొలం వద్ద ఏర్పాటు చేసిన గడ్డివాము కింద రోజు వారీగా ఆవులను, దూడలను కట్టి మేత వేసి మంగళవారం రాత్రి నిద్రపోయారు. ఉదయాన్నే లేచి చూడగా గడ్డివాము నుంచి దూడను లాక్కొని వెళ్లి చంపి తినగా మిగిలిన కళేబరం దూడను గుర్తించారు. ఆవులపై దాడి చేయకుండా దూడపై దాడిచేయడంలో నష్టం తప్పిందని రైతు ఆందోళన వ్యక్తం చేశారు. సమాచారం తెలుసుకొన్న ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ప్రభాకర్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. దూడపై దాడిచేసి చంపింది చిరుతపులిగా ఆనవాళ్లు, దూడపై గల పంజాను చూసి నిర్ధారించి పుంగనూరు ఎఫ్ఆర్వో శ్రీరాములుకు నివేదించారు. బాధిత రైతును ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. కాగా చిరుతపులి సంచారం విషయం తెలిసిన గ్రామస్తులు, పరిసర ప్రాంత రైతులు భయాందోళనకు గురవుతున్నారు. ప్రజలు ఎవరూ అంకాలమ్మ కొండ పరిసర ప్రాంతాల్లోకి ఒంటరిగా వెళ్లవద్దని గుంపులుగా వెళ్లాలని, పశువులు, గొర్రెలు మేకల మంద యజమానులు అటువైపు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అటవీశాఖ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

దృఢత్వానికి ప్రతీక భారతి అల్ట్రాపాస్ట్ సిమెంట్

గుడిపాల : నమ్మకానికి, దృఢత్వానికి ప్రతీకగా భారతి అల్ట్రాపాస్ట్ సిమెంట్ నిలుస్తుందని ఆ సంస్థ టెక్నికల్ మేనేజర్ సి.ఛాయాపతి తెలిపారు. బుధవారం గుడిపాల మండలంలోని బొమ్మసముద్రంలో కనక మహాలక్ష్మి ట్రేడర్స్ మనోజ్‌కుమార్, సునీల్, సుధీర్ ఆధ్వర్యంలో తాపీ మేస్త్రీలకు అవగాహన సదస్సు నిర్వహించారు. సంస్థ టెక్నికల్ మేనేజర్ ఛాయాపతి మాట్లాడుతూ.. జర్మనీ టెక్నాలజీ, రోబోటిక్ క్వాలిటీ కంట్రోల్ ఇంజినీరింగ్ నిపుణుల పర్యవేక్షణలో అత్యుత్తమ నాణ్యతా ప్రమాణాలతో భారతి అల్ట్రా పాస్ట్ సిమెంట్‌ను ఉత్పత్తి చేస్తున్నట్లు వెల్లడించారు. టెంపర్ ప్రూఫ్ బస్తాలతో మార్కెట్‌లోకి వస్తుండడంతో తూకం తగ్గే అవకాశం ఉండదన్నారు. సిమెంట్ రంగంలో భారతి సిమెంట్ అగ్రగామిగా నిలిచిందని తెలిపారు. అనంతరం భారతి సిమెంట్‌కు సంబంధించిన నాణ్యతా ప్రమాణాలు, విశిష్టత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. భారతి అల్ట్రా పాస్ట్ సిమెంట్ తయారవుతున్న విధానం, భవన నిర్మాణ కార్మికులు పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. వినియోగదారుల సౌలభ్యం కోసం భారతి సిమెంట్ ప్రతిచోటా అందుబాటులో ఉండేలా డీలర్లను ఏర్పాటు చేసినట్లు ఆయన వెల్లడించారు. అనంతరం తాపీ మేస్త్రీలకు రూ.లక్ష ప్రమాద బీమా పత్రాలను అందజేశారు.



తాపీ మేస్త్రీలకు బీమా పత్రాలను అందజేస్తున్న భారతి సిమెంట్ టెక్నికల్ మేనేజర్ ఛాయాపతి

సోషల్ వెల్ఫేర్ డీడీగా విక్రమ్‌కుమార్‌రెడ్డి



కలెక్టర్‌కు మొక్కను అందజేస్తున్న విక్రమ్ కుమార్‌రెడ్డి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ గా నియమితులైన విక్రమ్ కుమార్‌రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కలెక్టరేట్‌లోని ఆ శాఖ కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీని కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు. అనంతరం డీడీ విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని ప్రభుత్వ వసతి గృహాల్లో అడ్మిషన్ల పెంపు, ఎస్సీ వసతి గృహాల బలోపేతానికి పటిష్ట చర్యలు చేపడుతామన్నారు. అనంతరం నూతన డీడీని ఆ శాఖ సూపరింటెండెంట్ మురుగేష్, సూర్యప్రకాష్, అశోక్, గౌతమ్ తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు.

పర్మిట్లకు అగచాట్లు

గుడిపాల : పర్మిట్ల కోసం రైతన్నలు పడిగాపులు పడుతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం దాకా ఉన్నా రైతులకు మాత్రం పర్మిట్లు అందడం లేదు. గుడిపాల మండలంలోని తాసా, ఫుడ్ అండ్ ఇన్స్ జ్యూస్ ఫ్యాక్టరీలలో రైతుల నుంచి మామిడి కాయలను కొనుగోలు చేస్తామని కలెక్టర్ తెలియజేశారు. మంగళవారం ఏకంగా కలెక్టర్ తనిఖీలు నిర్వహించగా రైతుల పర్మిట్‌లను కొంతసేపు ఇచ్చి ఆపేశారు. ఆ తరువాత ఇవ్వడానికి కుదరదని తెగేసి చెప్పారు. ప్రస్తుతం ఇచ్చిన పర్మిట్లకు మాత్రమే తీసుకొని తరువాత పర్మిట్లు మంజూరు చేస్తామని చెప్పారు.

తమిళనాడు ప్రాంతం వారికి ప్రాధాన్యం

తమిళనాడు నుంచి వస్తున్న మామిడి కాయలకు ఫ్యాక్టరీ యాజమాన్యం అధిక ప్రాధాన్యం ఇస్తోంది. అక్కడి నుంచి తక్కువ రేటుకు మామిడి దిగుబడి చేసుకోవడంతో ఇక్కడ రైతులను పట్టించుకోవడం లేదు. ఇక్కడ కొనుగోలు చేస్తే రైతుల వద్ద నుంచి రూ.8 కి కొనుగోలు చేయాలి. తమిళనాడు నుంచి వచ్చినట్లయితే రూ. 6కే తమకు వస్తుందని ఫ్యాక్టరీ వారు చెబుతున్నారు.

– రైతుల వద్ద నుంచి మామిడి కాయలను కొనుగోలు చేస్తామని ఉద్యానవనశాఖ ఏడీ కోటేశ్వరరావు అన్నారు. బుధవారం గుడిపాలలోని ఫుడ్ అండ్ ఇన్స్ ఫ్యాక్టరీ వద్ద ఆయన రైతులతో మాట్లాడారు. యాజమాన్యంతో చర్చించి అధికంగా పర్మిట్లు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని రైతులు ఆందోళన చెందొద్దని ఆయన హామీ ఇచ్చారు.



రైతులతో మాట్లాడుతున్న కోటేశ్వరరావు

మండీల్లో మామిడి కొనుగోళ్లు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ర్యాంప్, మండీల నిర్వాహకులు ఇకపై మామిడిని కొనుగోలు చేసుకోవచ్చని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లో ర్యాంప్, మండీల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని ర్యాంప్, మండీల నిర్వాహకులు తప్పనిసరిగా మార్కెటింగ్ శాఖ ఏడీ వద్ద ముందస్తుగా రిజిస్ట్రేషన్లు చేసుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న వారు మాత్రమే మామిడిని కొనుగోలు చేయాలన్నారు. రైతుల నుంచి ఎన్ని టన్నులు కొనుగోలు చేశారు..రైతుల పేర్లు, మామిడి లారీలు ఏ కంపెనీకి, ఇతర రాష్ట్రాలకు వెళ్తున్నాయి అనే అంశాలను తప్పనిసరిగా సేకరించాలన్నారు. ప్రాసెసింగ్ కంపెనీలు రూ.8 ప్రభుత్వం తరపున రైతులకు ప్రోత్సాహకంగా రూ.4 తప్పనిసరిగా అందజేయడం జరుగుతుందన్నారు. అనంతరం ర్యాంప్, మండీల నిర్వాహకులు కలెక్టర్ దృష్టికి పలు సమస్యలు తీసుకొచ్చారు. సమావేశంలో జేసీ విద్యాధరి, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

ట్రాక్టర్‌ను ఢీకొన్న ఐచర్

– రైతు మృతి, మరో వ్యక్తికి గాయాలు



నలగాంపల్లె వద్ద మృతి చెందిన మణిరెడ్డి, (ఇన్‌సెట్) మణిరెడ్డి (ఫైల్)

బంగారుపాళెం : మండలంలోని నలగాంపల్లె వద్ద చెన్నై-బెంగళూరు జాతీయ రహదారిపై బుధవారం ఉదయం ట్రాక్టర్‌ను ఐచర్ వాహనం ఢీకొన్న సంఘటనలో యాదమరి మండలానికి చెందిన ఓ రైతు మృతి చెందగా, మరోవ్యక్తి గాయపడినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. యాదమరి మండలం సీఆర్ కండ్రిగ గ్రామానికి చెందిన రైతు మణిరెడ్డి తన సొంత ట్రాక్టర్‌లో మామిడి కాయలను బంగారుపాళెం మామిడి మార్కెట్‌కు తీసుకొచ్చాడు. మండిలో కాయలను అన్‌లోడ్ చేసి తిరిగి స్వగ్రామానికి ట్రాక్టర్‌పై బలిజపల్లె గ్రామానికి చెందిన వెంకటేశ్వర్‌రెడ్డితో కలసి బయలుదేరారు. వీరు ప్రయాణిస్తున్న ట్రాక్టర్‌ను నలగాంపల్లె అండర్ బ్రిడ్జి సమీపంలో పలమనేరు నుంచి చిత్తూరు వైపు పోతున్న ఐచర్ వాహనం వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ నడుపుతున్న మణిరెడ్డి (60) రోడ్డుపై పడిపోవడంతో ఐచర్ వాహనం తలపై దూసుకుపోయింది. ఈ ఘటనలో మణిరెడ్డి సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. వెంకటేశ్వర్ రెడ్డి స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. గాయపడిన వ్యక్తిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బంగారుపాళెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన లారీ

– దంపతులకు గాయాలు



గాయపడ్డ రాజేష్, పూర్ణిమ

చిత్తూరు అర్బన్ : చిత్తూరు నగరంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులతో పాటు ఇద్దరు పిల్లలు కూడా గాయపడ్డారు. ట్రాఫిక్ సీఐ నిత్య బాబు కథనం మేరకు... ఐరాల మండలం మామిడి గుంట పల్లెకు చెందిన రాజేష్ ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నాడు. అతడికి భార్య పూర్ణిమ ఇద్దరు పిల్లలు ఉన్నారు. పాఠశాలలు పునః ప్రారంభం కానున్న నేపథ్యంలో పిల్లలకు పుస్తకాలు యూనిఫాం కొనడానికి చెర్లోపల్లి నుంచి చిత్తూరు వైపు ద్విచక్ర వాహనంలో వస్తుండగా ఎదురుగా వస్తున్న ఓ లారీ వీరి స్కూటర్‌ను ఢీకొట్టగా రాజేష్ పూర్ణిమతో పాటు ఇద్దరు పిల్లలకు గాయాలయ్యాయి. వీరిలో రాజేష్ దంపతుల పరిస్థితి విషమంగా ఉండడంతో ఇద్దరిని రాణి పేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చిన్నపిల్లలకు స్వల్ప గాయాలు తగలగా వీరిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఒకే స్కూటర్ పై నలుగురు ప్రయాణించడం డ్రైవింగ్ చేసే వ్యక్తి హెల్మెట్ పెట్టుకోకపోవడంతో గాయాల తీవ్రత ఎక్కువగా ఉందని పోలీసులు తెలిపారు.

గ్రానైట్ లారీలు సీజ్



చౌడేపల్లె: అక్రమంగా ఎలాంటి అనుమతి లేకుండా గ్రానైట్‌ను తరలిస్తున్న రెండు లారీలను రీజినల్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ కరీముల్లా షరీఫ్ బుధవారం సీజ్ చేశారు. చౌడేపల్లె వైపు నుంచి పుంగనూరు వైపునకు గ్రానైట్ తరలిస్తున్న రెండు లారీలు, ఒక ఇసుక లారీని సీజ్ చేసి జరిమానా విధించినట్లు సమాచారం. సీజ్ చేసిన వాహనాలను స్థానిక పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. గ్రానైట్, ఇసుక అక్రమ రవాణా నియంత్రణకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఆటో చోరీ

చిత్తూరు అర్బన్ : చిత్తూరు నగరంలోని వినాయకపురంలో ఆటో చోరీకి గురైంది. దీనిపై బాధితుడి ఫిర్యాదు చేశారు. ఆ వివరాలు ఇలా.. వినాయకపురానికి చెందిన మహమ్మద్ అలీ సొంతంగా ఆటో నడుపుతున్నాడు. గత నెల 20వ తేదీ రాత్రి ఇంటి వద్ద ఆటో ఉంచి.. ఉదయం లేచి చూసేసరికి కనిపించకుండా పోయింది. పలుచోట్ల వెతికినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

నెరవేరిన పేదల కల

తవణంపల్లె : పేదల కల నెరవేరిందని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని ఎ.గొల్లపల్లె హరిజనవాడలో ఇంటి పట్టాలు లేకుండా గత 25 ఏళ్లుగా నివాసం ఉంటున్న 47 మందికి పూర్తి హక్కు కల్పిస్తూ కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే మురళీమోహన్ ఇంటి పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ.. గ్రామంలోని సమస్యలు ఉంటే నా దృష్టికి తీసుకొస్తే పరిష్కరించి గ్రామాభివృద్ధికి సహకారం అందిస్తామన్నారు. ఎమ్మెల్యే మురళీమోహన్ మాట్లాడుతూ.. కలెక్టర్ ప్రత్యేక చొరవతో 25 రోజుల్లోనే 47 మందికి ఇంటి పట్టాలు మంజూరు చేశారన్నారు. అనంతరం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఏరువాక పౌర్ణమి కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే మురళీమోహన్ ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా పొలంలో ఎద్దుల మడక పట్టి దుక్కి దున్ని లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం వివిధ అభివృద్ధి కార్యక్రమాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి మురళీకృష్ణ, తహసీల్దార్ సుధాకర్, ఎంపీడీఓ హరిప్రసాద్‌రెడ్డి, ఈఓపీఆర్డీ రాఘవేంద్రరాజు, పీఆర్ డీఈ ప్రసాద్‌నాయుడు,ఏఈ జయచంద్రారెడ్డి, డ్వామా ఏపీడీ సుబ్రమణ్యం, ఏపీఓ బాల, ఈసీ రమ్య, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, రైతు సేవా కేంద్రం సిబ్బంది, చిత్తూరు రూరల్ సీఐ శ్రీధర్‌నాయుడు, ఎస్ఐ చిరంజీవి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా?



సమావేశంలో వీడియోను చూపిస్తూ ప్రశ్నిస్తున్న వైస్ ఎంపీపీ సుధాకర్‌రెడ్డి

చౌడేపల్లె : ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగిని ఆసుపత్రికి తీసుకొస్తే ఎవరూ ఉండరెందుకు ? ఆసుపత్రికి తాళం వేసి వెళ్లిపోండి అంటూ మండల సర్వసభ్య సమావేశంలో ప్రభుత్వాసుపత్రి వైద్యులు , సిబ్బంది తీరుపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఎంపీపీ గాజుల రామ్మూర్తి అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. గత నెల 16 వతేదీ పి.రెడ్డి ప్రసాద్ పురుగుమందు తాగి అపస్మారక స్థితిలో ఉన్న అతడిని ప్రభుత్వాసుపత్రికి తీసుకొస్తే వైద్య సిబ్బంది ఒక్కరూ లేకపోవడంతో మదనపల్లెకు తరలించి అక్కడి నుంచి మెరుగైన వైద్య సేవల కోసం తిరుపతికి తరలించారు. ఇలాంటి ఘటనలు నిత్యం జరుగుతున్నా పట్టించుకోవడంలేదంటూ వైద్య సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం జారీ చేస్తున్న హెల్త్ కార్డుల కోసం ప్రజల నుంచి ఎంత మంది వద్ద ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసి జారీ చేయించారో చెప్పాలని నిలదీశారు. వేరుశనగ విత్తన కాయలు ఒక్కో రైతుకు ఒక బస్తా ఇస్తే ఏమి చేయాలి , కొన్ని గ్రామాల్లో రైతులకు ఒక్కరికీ విత్తన కాయలు ఇవ్వకుండా పంపిణీ చేయడం ఏమిటని వ్యవసాయ శాఖ సిబ్బందిపై సభ్యులు మండిపడ్డారు. విద్యుత్ బిల్లులు చూస్తే గుండె జల్లు మంటోందని ట్రాన్స్‌కో అధికారులకు సభ్యులు మొరపెట్టుకొన్నారు. సచివాలయ సిబ్బంది కార్యాలయాల్లో ప్రజలకు అందుబాటులో ఉండడం లేదని గతంలో ఇలాంటి పరిస్థితి లేదన్నారు. స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమం ఆచరణలో పాటించడంలేదని, గత ప్రభుత్వంలో పంచాయతీల వారీగా కేటాయించిన చెత్త బుట్టలు, తడి పొడి చెత్త సేకరణకు వీలుగా మండలానికి సుమారు 16 వేలు బుట్టలు వచ్చాయని వాటిని పంపిణీ చేయకుండా కార్యాలయాల్లో నిల్వ ఉంచడం ఏమిటని ప్రశ్నించారు. పందిళ్లపల్లె పంచాయతీలో ఒక్కరికీ కూడా బుట్టలు పంపిణీ చేయలేదని నిలదీశారు. కాగా సమావేశానికి ఇరిగేషన్, హార్టికల్చర్ , ఆర్టీసీ, సిరికల్చర్, మత్స్యశాఖ అధికారులు డుమ్మాకొట్టారు. వీరిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు నివేదిచాలని ఎంపీడీఓను సభ్యులు కోరారు. సమావేశంలో వైస్ ఎంపీపీ నరసింహులు యాదవ్, ఎంపీడీఓ లీలామాధవి, తహసీల్దార్ హనుమంతునాయక్ తదితరులు పాల్గొన్నారు.